సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం । 31 । అక్టోబర్ । 2023


తలమడుగులో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు



బతుకమ్మ సంబురం

జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. మహిళలు ఉయ్యాల పాటలతో ఆడి పాడారు. అనంతరం వెళ్లిరా గౌరమ్మ అంటూ చెరువులు, వాగుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. IIలో▸


తలమడుగులో బతుకమ్మల నిమజ్జనానికి తరలివెళ్తూ..

న్యూస్‌రీల్

బాలకేంద్రం చిన్నారుల ప్రతిభ


బాలకేంద్రం చిన్నారులతో డీఈవో ప్రణీత

ఆదిలాబాద్: బాలకేంద్రం చిన్నారులు అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తుండడం అభినందనీయమని డీఈవో ప్రణీత అన్నారు. ఆన్‌లైన్ పోటీల్లో కూచిపూడిలో ప్రతిభ కనబరిచిన బాలకేంద్రం చిన్నారులకు ఆదివారం రాత్రి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. చిన్నారులను ప్రత్యేకంగా అభినందించారు. గతేడాది డిసెంబర్‌లో ఇంటర్నేషనల్ కర్ణాటక మ్యూజిక్, డాన్సర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిషాసుర మర్దిని ఆన్‌లైన్ మహా బృందనాట్యం పోటీలో బాల కేంద్రానికి చెందిన 49 మంది చిన్నారులు పాల్గొన్నట్లు పర్యవేక్షకుడు మిట్టు తెలిపారు. ఈ నాట్యానికి 10 ప్రపంచ రికార్డుల్లో చోటు దక్కిందన్నారు. ఇందులో బాల కేంద్రం తల్లిదండ్రుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్, సృజన, మాస్టర్ దత్తు తదితరులు ఉన్నారు.

డయల్ యువర్ డీఎంకు స్పందన


మాట్లాడుతున్న డీఎం కల్పన

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి స్పందన లభించింది. డిపో మేనేజర్ కల్పన వాటిని నమోదు చేసుకొని పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఉట్నూర్ నుంచి ఎండీ మక్బూల్ 5:30 గంటలకు కరీంనగర్, హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా, ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్తానని పేర్కొన్నారు. తాంసి నుంచి వినోద్ మాట్లాడుతూ ఉదయం 6 గంటలకు ఆదిలాబాద్ ఠాకూర్ హోటల్ నుంచి ఆదిలాబాద్ బస్‌స్టేషన్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించగా సానుకూలంగా స్పందించారు. అలాగే అరుణ్, అహ్మద్, వాహిద్, అలీలు ఆదిలాబాద్ నుంచి సిద్దిపేటకు వయా కామారెడ్డి మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా, విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఆదిలాబాద్ నుంచి బాలాజీ మాట్లాడుతూ శాంతాపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించగా ఈ రూట్లో సర్వే నిర్వహించి తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

'ఓటరు జాబితాలో అవకతవకలు'


మాట్లాడుతున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఓటరు జాబితాలో అవకతవకలు చోటు చేసుకున్నాయని ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే జోగు రామన్న అధికారాన్ని అడ్డం పెట్టుకొని అధికారులను ప్రభావితం చేస్తున్నారని ఆరోపించారు. ఆయన ప్రోద్బలంతోనే గతంలో బీజేపీ కౌన్సిలర్‌గా పోటీ చేసిన అభ్యర్థి పేరును సైతం ఓటరు జాబితా నుంచి తొలగించడం ఇందుకు నిదర్శనమన్నారు. అలాగే ఓటరు లిస్ట్‌లో ఎన్నో తప్పులున్నాయని, ఈ విషయమై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే నియోజకవర్గంలోని ఓ గ్రామానికి చెందిన 30 మంది ఓటర్లను తొలగించారన్నారు. ఈ విషయమై జిల్లా అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో నాయకులు ఎన్రాల నగేష్, జోగు రవి, ప్రవీణ్ రెడ్డి, లాలామున్నా తదితరులున్నారు.

బోథ్ బీఎస్పీ అభ్యర్థిగా మేస్రం జంగుబాపు


జంగుబాపు

బోథ్: బోథ్ అసెంబ్లీ బీఎస్పీ అభ్యర్థిగా మేస్రం జంగుబాపు ఖరారయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సోమవారం విడుదల చేసిన రెండోవిడత అభ్యర్థుల జాబితాలో వెల్లడించారు. బజార్‌హత్నూర్ మండలం ఎల్లాయిపల్లె గ్రామానికి చెందిన జంగుబాపు ఎంటెక్ పూర్తి చేశారు. 2014లో బీఎస్పీలో చేరారు. అప్పటి నుంచి జిల్లా వ్యాప్తంగా పర్యటించి పార్టీ బలోపేతానికి కృషి చేశారు.


కలెక్టర్ సమక్షంలో వేలం పాడుతున్న వ్యాపారులు

బోణీ..గిట్టుబాటు కాలె!

- ఆదిలాబాద్‌లో పత్తి కొనుగోళ్లు షురూ
- వేలం ద్వారా ధర నిర్ణయం
- తొలిరోజు రూ.7,100
- రైతుల్లో అసంతృప్తి
- ధర పెంచేందుకు ససేమిరా అన్న వ్యాపారులు


పత్తి వాహనాన్ని తూకం వేస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లను కలెక్టర్ రాహుల్‌రాజ్ సోమవారం ప్రారంభించారు. వేలం ద్వారా క్వింటాలుకు రూ.7,100 ధర నిర్ణయించారు. ప్రైవేట్ వ్యాపారులు ధర పెంచేందుకు ససేమిరా అన్నారు. సీసీఐ మద్దతు ధర రూ.7,020తో ముందుకు రాగా, ప్రైవేట్ వ్యాపారులు మొదట రూ.6,800 నుంచి వేలం పాడారు. రూ.10 చొప్పున పెంచుతూ రూ.7070 వరకు చేరుకున్నారు. ఆ తర్వాత ధర పెంచేందుకు ముందుకు రాలేదు. దీంతో కలెక్టర్ వారిని పిలిచి ధర పెంచాలని సూచించారు. చివరికి రూ.7100 వరకు పెంచుతామని, అంతకుమించి తాము చెల్లించలేమని తెలిపారు. దీంతో పత్తి క్వింటాలు ధర తొలిరోజు రూ.7,100 పలికింది. సీసీఐ రంగంలో ఉన్నప్పటికీ మద్దతు ధర కంటే రూ.80 అధికంగా చెల్లించడంతో మొదటి రోజు కొనుగోలు చేపట్టలేదు. ప్రైవేట్ వ్యాపారులంతా సిండికేట్‌గా మారి ధర నిర్ణయించినట్లు చర్చ సాగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బేళ్ ధర తక్కువగా ఉందని, ఇంతకంటే ఎక్కువ చెల్లించలేమని వ్యాపారులు చేతులెత్తేశారు. 13 బండ్లు మాత్రమే మార్కెట్‌కు వచ్చాయి.

కొనుగోళ్లు ప్రారంభం..

యార్డులో పత్తి కొనుగోళ్లను కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. పత్తి విక్రయించిన మొదటి రైతును కలెక్టర్ శాలువాతో సత్కరించి మిఠాయి తినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పత్తి ప్రధాన పంట అని తెలిపారు. యార్డులో రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించామన్నారు. వ్యాపారులు సిండికేటై రైతులకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రైతులు పత్తిలో తేమ శాతం లేకుండా చూసుకొని మార్కెట్‌కు తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అజ్మీరా రాజు, జాయింట్ డైరెక్టర్ మల్లేశం, ఏడీ శ్రీనివాస్, ఆదిలాబాద్ మార్కెట్ కార్యదర్శులు మధుకర్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రైతును సన్మానిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రైవేటు వ్యాపారుల సిండికేట్..

ఏటా పత్తి విక్రయించే రైతులకు సరైన ధర లభించకుండా పోతోంది. వ్యాపారులు కుమ్మక్కై ధర నిర్ణయిస్తున్నారని వారు వాపోతున్నారు. పత్తి నిల్వలు ఉన్నప్పుడు తక్కువ ధర నిర్ణయించడం, విక్రయించిన తర్వాత కొంత మంది వ్యాపారులు ధర పెంచడంతో రైతులు నష్టపోతూనే ఉన్నారు. గతేడాది మొదట్లో పత్తిధర రూ.8వేల నుంచి రూ.9వేల వరకు ఉండగా, రైతులు ధర పెరుగుతుందని విక్రయించకుండా ఇంట్లో నిల్వఉంచిన తర్వాత రూ.7500–రూ.8వేలలోపు మాత్రమే కొనుగోలు చేశారు. ముందుగానే వ్యాపారులు ఒకచోట సమావేశమై ధర నిర్ణయంపై చర్చించుకుంటారనే ప్రచారం సాగుతోంది. వేలంలో రూ.10 చొప్పున పెంచుతూ వారు అనుకున్న ధరకే ఆపివేస్తారు. యార్డుకు పత్తి బండ్లు తీసుకొచ్చిన రైతులు గత్యంతరం లేక చివరికి వారు నిర్ణయించిన ధరకే పంట విక్రయించాల్సి వస్తోంది. అలాగే తేమ పేరిట కొర్రీలు తప్పడం లేదని పేర్కొంటున్నారు. అసలే ధర లేక అవస్థలు పడుతున్న రైతులకు ఈ తేమ తంటాలు తప్పడం లేదు.

తొలిరోజు తక్కువ సంఖ్యలోనే బండ్లు..

యార్డుకు తొలిరోజు పత్తి బండ్లు తక్కువ సంఖ్యలో వచ్చాయి. సీసీఐ నిబంధనల మేరకే ప్రైవే ట్ వ్యాపారులు కొనుగోలుకు ముందుకొచ్చారు. తేమ శాతం 8వరకు ఉంటే మద్దతు ధర కల్పించారు. ఆ తర్వాత ఒక్కో శాతానికి కిలో ధర చొప్పున కోత విధించారు. అధిక వర్షాలతో ఇంకా పత్తి పూర్తిస్థాయిలో రైతుచేతికి రాలేదు. దీపావళి తర్వాత దిగుబడులు ఇంటికి చేరుకుంటాయని పేర్కొంటున్నారు. ప్రస్తుతం రైతు అనుకున్న విధంగా గిట్టుబాటు ధర లభించలేదు. ఎన్నికల కోడ్ ఉండడంతో ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు మార్కెట్ యార్డుకు రాలేదు. దీంతో రైతులు కూడా వ్యాపారులు, అధికారులపై ఒత్తిడి చేయలేకపోయారు. గతేడాది క్వింటాలు ధర రూ.8వేలు ఉంటే, ఈ ఏడాది రూ.వెయ్యి వరకు తగ్గింది. పెట్టుబడులు పెరుగుతుండగా ప్రస్తుతం చెల్లించే మద్దతు ధర గిట్టుబాటు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రూ.9వేలతో కొనుగోలు చేయాలని కోరారు.


యార్డుకు తొలిరోజు వచ్చిన బండ్లు

యువతా మేలుకో..

- ఓటరు నమోదుకు చివరి అవకాశం
- నేటితో ముగియనున్న గడువు



బోథ్: అక్టోబర్ ఒకటో తేదీ వరకు 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. రాబోయే ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. ఇదే చివరి అవకాశమని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఈ క్రమంలో గడువు నేటితో ముగియనుంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు...

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఎన్నికల సంఘం కొత్త ఓటరు నమోదుకు మరో అవకాశం కల్పించింది. అక్టోబర్ 31లోగా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకునే వీలు కల్పించింది. ప్రస్తుతం యువ ఓటర్ల నమోదుపై ఆసక్తి కనబరుస్తున్నారు.

పెరగనున్న యువ ఓటర్లు..

జిల్లాలోని మొత్తం 592 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ఆదిలాబాద్ నియోజకవర్గంలో 290, బోథ్ నియోజకవర్గంలో 302 ఉన్నాయి. ఆదిలాబాద్‌లో 2,35,748 ఓటర్లు ఉండగా, బోథ్‌లో 2,06,690 ఓటర్లు ఉన్నారు. ఇటీవల 18ఏళ్లు నిండిన వారు జిల్లాలో 16వేల వరకు ఉన్నారు. ప్రస్తుతం ఎన్నికల సంఘం ఓటరు నమోదుకు చివరి అవకాశం కల్పించడంతో వీరి సంఖ్య మరింత పెరగనుంది.

సందేహం ఉంటే కాల్ చేయండి..

కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారికి ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారానే అవకాశం ఇచ్చారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో ఓటరు నమోదుతో పాటు మార్పులు, చేర్పులకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించేవారు. ప్రస్తుతం అధికారులంతా ఎన్నికల విధుల్లో ఉండటంతో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అర్హులైన వారు మీ సేవా లేదా ఓటరు హెల్ప్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. సందేహాలు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 1950కు కాల్ చేసి నివృత్తి చేసుకోవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి



ఇప్పటికీ ఓటరుగా నమోదు చేసుకోని వారికి భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. ఈ నెల 31వ లోపు మీ సేవా కేంద్రం లేదా ఓటరు హెల్ప్‌లైన్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి.

– చాహత్ బాజ్‌పాయ్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బోథ్ నియోజకవర్గం

నేరాల అదుపులో పోలీసుల పాత్ర కీలకం



ఆయుధాల పనితీరును విద్యార్థులకు వివరిస్తున్న పోలీసులు

- వర్టికల్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్
- ఓపెన్‌హౌస్‌లో విద్యార్థులకు అవగాహన

ఆదిలాబాద్‌టౌన్: నేరాల అదుపులో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని వర్టికల్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో సోమవారం ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఆయా పాఠశాలల విద్యార్థులకు ఆయుధాలు, పోలీసు విధులు, డాగ్‌స్క్వాడ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏకే–47, ఎస్ఎల్ఆర్, ఎంఎంజీ, పిస్టల్, రివాల్వర్, డబుల్‌బార్, పంప్ యాక్షన్, గ్యాస్ గన్, మెటల్ డిటెక్టర్, పోలీసు డాగ్స్ తదితర వాటి పనితీరును వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసుల విధులపై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమన్నారు. ఎక్కడైన ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలన్నారు. కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ సీఐలు మురళి, నవీన్‌కుమార్, టూటౌన్ సీఐ అశోక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


డాగ్‌స్క్వాడ్ పనితీరును వివరిస్తూ..

కాంగ్రెస్ సీనియర్ల అసమ్మతి రాగం

- 'కంది'కి వ్యతిరేకంగా సమావేశం
- అభ్యర్థిని మార్చకుంటే పార్టీకి పనిచేయమని స్పష్టీకరణ


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థిగా పార్టీ అధిష్టానం కంది శ్రీనివాస రెడ్డిని ప్రకటించడంపై ఆ పార్టీలో అసమ్మతి వ్యక్తమవుతుంది. ఎమ్మెల్యే టికెట్‌ను ఆశించి భంగపడ్డ ఆ పార్టీ సీనియర్ నాయకులు కందికి వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు. ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత, డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు చిల్కూరి లక్ష్మారెడ్డి సోమవారం పట్టణ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో 'సేవ్ కాంగ్రెస్ ఫ్రమ్ ఆర్ఎస్ఎస్' నినాదంతో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలను వారికి వివరించారు. టికెట్ కేటాయింపుపై అధిష్టానం తీరును తప్పుపట్టిన సదరు నాయకులు అభ్యర్థిని మార్చాల్సిందేనని డిమాండ్ చేశారు. అధిష్టానం స్పందించకుంటే ఎలా ముందుకు సాగాలనే దానిపై పార్టీ శ్రేణుల నుంచి అభిప్రాయాలు స్వీకరించారు. పార్టీ అభివృద్ధి కోసం కష్టపడ్డ వారిని కాదని బీజేపీ, ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వ్యక్తికి టికెట్ ఇవ్వడం కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీసిందని వారు అభిప్రాయపడ్డారు. కంది అభ్యర్థిత్వాన్ని వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో తాము ఎవరమూ పార్టీ పక్షాన పనిచేయబోమని స్పష్టం చేశారు. నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి వారి అభిప్రాయాలు తెలుసుకున్న అనంతరం రెండు రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. కాగా మంగళవారం ఏఐసీసీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, కర్ణాటక ఎమ్మెల్సీ ప్రకాశ్ రాథోడ్ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి సీనియర్ నాయకులు హాజరవుతారా లేక తమ అసమ్మతిని కొనసాగిస్తారా అనేది ఆసక్తికరంగా మారింది.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేయాలి


- 3 నుంచి ఎన్నికల పరిశీలకుల క్షేత్రస్థాయి పర్యటన
- కేంద్ర డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్
- కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్


వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ

కైలాస్‌నగర్: నామినేషన్ల స్వీకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కేంద్ర డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్ అన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ నిర్వహణ, సన్నద్ధతపై ఆయన న్యూ ఢిల్లీ నుంచి ఆయా జిల్లా కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నామినేషన్ల స్వీకరణ సమయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సమయపాలన పాటించాలన్నారు. పోటీ చేసే ప్రతీ అభ్యర్థికి తప్పనిసరిగా ఓటరు జాబితా వివరాలు అందించాలన్నారు. స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అభ్యర్థుల సమక్షంలో ఈవీఎంల రెండో ర్యాండమైజేషన్ చేపట్టాలని, అభ్యర్థులు అధికంగా ఉంటే సప్లిమెంటరీ ర్యాండమైజేషన్‌కు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెండింగ్ ఓటరు నమోదు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పోలింగ్ సక్రమంగా జరిగేలా ఓటరు స్లిప్పులను పంపిణీ చేయాలని, ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలన్నారు. ఈవీఎంలు తరలించే అధికారులకు అవసరమైన భద్రత కల్పించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల జాబితాను అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు అందజేయాలని సూచించారు. పోలింగ్ సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా కేంద్రాల్లో అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించాలని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మోడల్ కేంద్రాల ఏర్పాటు చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని, ఎన్నికల విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులు, అత్యవసర సేవల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలు తప్పకుండా అమలు చేయాలని, సి-విజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. మీడియా సెంటర్‌లో ఎన్నికల రికార్డులకు సంబంధించి ప్రతీ అంశం భద్రపరచాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు అవసరమయ్యే వివిధ రకాల అనుమతులను ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ ప్రాతిపదికన నిష్పక్షపాతంగా అందించాలన్నారు. ఎన్నికల తనిఖీల్లో భాగంగా నగదు జప్తు చేసే సమయంలో ఈసీ మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీ ప్రతిరోజు వచ్చే అప్పీళ్లపై చర్చించి నిర్ణయం తీసుకోవాలని, రూ.10 లక్షల కంటే అధికంగా నగదు జప్తు చేసిన సమయంలో ఐటీ అధికారులకు సమాచారం అందించాలన్నారు. నవంబర్ 3 నుంచి ఎన్నికల పరిశీలకుల క్షేత్రస్థాయి పర్యటన ఉంటుందని సన్నద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఇందులో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్లు కుష్బూగుప్తా, శ్యామలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆ ఊరిలో మహిళలందరూ ఓటేశారు


పిప్పల్‌ధరి గ్రామం

బోథ్: మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓటర్లందరూ తమ ఓటును వినియోగించుకుని ఆదర్శంగా నిలిచారు. గ్రామంలో మొత్తం 367 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 179, మహిళలు 188 మంది ఉన్నారు. పురుషులు 168 మంది, మహిళా ఓటర్లు తమ ఓటును వినియోగించుకున్నారు. ఈ గ్రామంలో 97 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో ఈ గ్రామంలోనే అత్యధిక పోలింగ్ శాతం నమోదైంది. కాగా, ఈ ఎన్నికల్లో వందశాతం పోలింగ్‌లో పాల్గొని ఓటేస్తామని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

సీఎం సభాస్థలి పరిశీలన

భైంసాటౌన్: పట్టణంలోని పార్డి(బి)బైపాస్ రోడ్‌లో సీఎం ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను ఎస్పీ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. సోమవారం భైంసాకు చేరుకున్న ఆయన సభాస్థలికి చేరుకుని, హెలీప్యాడ్, ఇతర ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆయన వెంట పట్టణ సీఐ ఎల్. శ్రీను, ఏఎంసీ వైస్ చైర్మన్ జెకె పటేల్ ఉన్నారు.

ఏలేటికి రూ.1,00,116 చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: బీజేపీ నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి మద్దతుగా మండలంలోని చామన్‌పెల్లి పసుపు రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు రూ.1,00,116 చెక్కు అందజేశారు. ఏలేటిపై తమ అభిమానం చాటుకున్నారు. నాయకులు వెంకట్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రైతులు మల్లేశ్, సాయన్న, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

'జంతర్‌మంతర్' వద్ద ధర్నా

నిర్మల్‌చైన్‌గేట్: ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సోమవారం నిర్వహించారు. ఈ ధర్నాలో జిల్లా నుంచి ఆశ కార్యకర్తలు, ఆశ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు. పి.జయలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, ప్రధాన కార్యదర్శి గంగమని, గౌరవ అధ్యక్షురాలు సుజాత, ఉపాధ్యక్షురాలు భాగ్య, పద్మ, ఇంద్రమల, సరిత, గోదావరి, సుగుణ పాల్గొన్నారు.

పాటకు జై..ప్రచారానికి సై

- ప్రత్యేక గీతాలతో హోరు
- పార్టీ, అభ్యర్థుల ప్రత్యేక పాటలు రికార్డింగ్
- ఓటర్లను ఆకర్షించేలా వ్యూహాలు


నృత్యాలతో అలరిస్తున్న కళాకారులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: జిల్లాలో రాజకీయ పార్టీల ప్రచారసందడి షురువైంది. గోడరాతలు పోస్టర్లు సభలు సమావేశాలకు తోడుగా ప్రత్యేక గీతాలతో పార్టీలు, అభ్యర్థుల గుణగణాలు, హామీలు, పథకాలు వంటి వాటితో ప్రత్యేక పాటలను రికార్డింగ్ చేయించారు. జనాల మధ్య పాటల్ని పెద్ద లౌడ్‌స్పీకర్లలో పెడుతున్నారు. విభిన్నమైన ప్రచార సాధనాలు వినియోగిస్తున్నారు. దసరా నవరాత్రులు పూర్తవడంతో క్రమంగా ప్రచారపర్వాన్ని ఉధృతం చేశారు. ప్రధాన రాజకీయ పార్టీలతోపాటు ఆయా అభ్యర్థులు తమ పార్టీల పథకాలను గుర్తుతెచ్చేలా పాటలను ప్రత్యేకంగా కంపోజ్ చేయించి రికార్డు చేశారు. కాగా ఈ పాటల్ని డిజిటల్ విధానంలో లౌడ్‌స్పీకర్లలో ఆకట్టుకునే సంగీతంతో ప్రజలకు వినిపించేందుకు ప్రత్యేక వాహన ఏర్పాట్లు చేస్తున్నారు.

కార్యకర్తల్లో జోష్

ఆయా రాజకీయ పార్టీలు డీజే సౌండ్ బాక్స్‌తో కూడిన ఆకట్టుకునే రీతిలో వినూత్నంగా సంగీతంతో కూడిన పాటలతో హోరెత్తిస్తున్నారు. ఎల్ఈడీ తెరలపై పార్టీ అభ్యర్థుల హామీలు, మేనిఫెస్టో, నేపథ్యం చాటేచిత్రాలు, వీడియోలతో బ్యాగ్రౌండ్‌లో పాటలను ఆసక్తి పెంచేలా తయారు చేస్తున్నారు.

గ్రామాల్లో ప్రచార సందడి

నవరాత్రోత్సవాలు పూర్తవడంతో ప్రచార పర్వం ఊపందుకుంది. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పరిధిలోని గ్రామాల్లో ప్రచారం మొదలైంది. డీజే సౌండ్‌బాక్స్‌లతో కూడిన అభ్యర్థులు, పార్టీలకు సంబంధించి ప్రచారహోరు ఎక్కడికక్కడ కనిపిస్తోంది. జిల్లాలో ప్రధానంగా మూడు పార్టీల అభ్యర్థులతో కూడిన ప్రచారం కనిపిస్తుంది. ఇప్పటికే నిర్మల్, ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఖరారు కొలిక్కి రావడంతో ప్రచార రథాలు సైతం రోడ్డెక్కాయి. మైక్ సెట్, మాట్లాడేందుకు స్పీకర్లతో కూడిన సౌకర్యాలతో అవి సిద్ధమయ్యాయి. దీనికితోడు డ్రైవర్ మాత్రమే కలిగి ఉండే పార్టీ ప్రచారాన్ని సూచించే పాటలతో కూడిన వాహనాలను ఓటర్లను ఆకట్టుకునేలా తీర్చిదిద్ది గ్రామాల వెంట తిప్పుతున్నారు.

ఇప్పటికే డీజేతో కూడిన ప్రత్యేక వాహనాల్లో పాటల సందడి మొదలైంది. పార్టీ కోసం అభ్యర్థి కోసం రాయించిన పాటలను వినిపిస్తూ ఓటర్లను ఆకట్టుకునేలా ప్రయత్నం చేస్తున్నారు.

అభ్యర్థి, పార్టీ..పాటలు ప్రత్యేకం

ఆయా పార్టీల అభ్యర్థులు ప్రత్యేకంగా తమ పేర్లతో కూడిన పాటలను రికార్డు చేయించుకున్నారు. తమ పేరు వచ్చేలా కనీసం మూడు నుంచి ఐదు పాటలు రాయించి ప్రత్యేక సంగీతంతో ఆకట్టుకునేలా రికార్డింగ్ చేయించారు. ఇక ఆయా పార్టీల అధిష్టానం ఇచ్చే పాటలు అదనం. ఇందులో సాహిత్యం మొత్తం పార్టీ, పథకాలను సూచించేవిధంగా ఉంటున్నాయి. ప్రత్యేకంగా వీటి కోసం దాదాపు 6 నుంచి 8 పాటలు సిద్ధం చేశారు. ఇక ఈ పాటలను ఎల్ఈడీ తెరలపై వీడియోలు జతచేస్తూ ముస్తాబు చేశారు. పాటల రచయిత, సంగీత దర్శకుడు, స్టూడియో, వాయిద్యాకారులు, గాయకులు వీడియో ఎడిటింగ్ కలిపి మొత్తం ఖర్చు చెల్లించాల్సి ఉంటుంది.

కళాజాత బృందాలు బిజీబిజీ

ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానంగా మూడు పార్టీల అభ్యర్థులు బరిలో ఉంటున్నారు. ఒక్కో పార్టీకి మూడు కళాజాత బృందాలు అవసరం ఉంటున్నాయి. నియోజకవర్గంలో ఒక బృందం అభ్యర్థి వెంట మిగతా రెండు బృందాలు ఇతర మండలాల్లో ప్రచారం నిర్వహించడానికి కార్యాచరణ చేస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకుంటూ ప్రవేశపెట్టిన పథకాలు, ఇచ్చే హామీలు ప్రజల్లోకి చేరువ చేసేందుకు కళాజాత బృందాలు శ్రమించనున్నాయి. స్థానిక భాషలో అర్థమయ్యేలా బృందాలు పాటలు, గాత్ర రూపంలో పనిచేయనున్నాయి. ఇందుకు జానపద కళా కారులు బృందాలను ఆయా పార్టీలు ముందస్తు ఒప్పందాలు చేసుకుంటున్నాయి. రానున్న 30 రోజుల పాటు ఉధృత ప్రచార హోరు కనిపించనుంది.


పాటలు పాడుతున్న కళాకారుల బృందం సభ్యులు (ఫైల్)

రాత.. దాటొద్దు గీత



- సామాజిక మాధ్యమాలపై పోలీస్ శాఖ నిఘా
- ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లతో వాట్సాప్ గ్రూప్‌లు

నిర్మల్‌చైన్‌గేట్: అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రచార పర్వం వేడెక్కుతుంది. బరిలో ఉన్న నేతలు ఓటర్లను ఆకట్టుకునేందుకు సామాజిక మాధ్యమాలపై దృష్టిసారిస్తున్నారు. వాట్సాప్, ఎక్స్ ఖాతా, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ తోపాటు మరికొన్ని సోషల్ మీడియా వేదికగా చేసుకుంటున్నారు. జిల్లాలో పలువురు నేతలు ఇప్పటికే వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసుకోగా, పోస్టు చేసేందుకు యువకులు, బృందాలను నియమించుకుంటున్నారు. ఇక ఫేస్‌బుక్, ఎక్స్ ఖాతాను విద్యార్థులు, యువత ఎక్కువగా వినియోగిస్తున్నారు.

ఓటర్లకు చేరవేసేలా..

ఫేస్‌బుక్‌లో ఎమ్మెల్యేల అభ్యర్థులు, ఆశవాహుల అభ్యర్థుల పేర్ల మీద యువసేన పనిచేస్తోంది. ఇందులో యువతే అధికంగా ఉండడంతో ఆయా పార్టీలకు ఉపయోగపడనుంది. నియోజకవర్గాల వారీగా వాట్సాప్ ద్వారా తమ సందేశాన్ని తెలిపేందుకు యత్నిస్తున్నాయి. ఇందుకు ఓటర్ల సెల్‌ఫోన్ నంబర్లు అవసరం. వాటి సేకరణ బాధ్యత గ్రామాల పార్టీ శ్రేణుల నుంచి తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. ముఖ్యంగా గ్రామాల బాధ్యులతో పార్టీ ప్రచార సందేశాన్ని ఓటర్లకు చేరవేసే ప్రయత్నం చేస్తున్నారు.

వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా అధ్యయనం

బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు ఇప్పటికే ఖరారు కావడంతో ప్రచారం ఆరంభమైంది. నాయకుల అనుచరుల ప్రచారం, ఫొటోలు, వీడియోలను ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్నారు. పార్టీలు ఇప్పటికే గ్రామ,మండల,నియోజకవర్గ స్థాయి వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేస్తున్నారు. ఇది కాకుండా నేరుగా ఎమ్మెల్యే అభ్యర్థిని చేరుస్తూ ముఖ్యనాయకుల గ్రూప్ ఒకటి ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. జిల్లాకేంద్రానికి సమీపంలోని నియోజకవర్గ తాజా, మాజీ ఎమ్మెల్యే గ్రామస్థాయిలో అసంతృప్తులు, ప్రజలేమనుకుంటున్నారు. ఏం కోరుకుంటున్నారు.. అనే విషయాలను గ్రామస్థాయి కార్యకర్తల వాట్సాప్ గ్రూప్ ద్వారా అధ్యయనం చేస్తున్నారు. దీన్ని ఆధారంగా చేసుకుని ప్రచారంలో వ్యూహాలు రూపొందిస్తున్నట్లు తెలిసింది. నాయకుల కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా వారి తరఫున సామాజిక మాధ్యమాల ఖాతాలను నిర్వహిస్తున్నారు. అందులో నాయకుల కటౌట్లతో ఫొటోలను తయారు చేసి ప్రచారం చేస్తున్నారు.

ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేయవచ్చు

ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. క్షణాల్లో వదంతులు సృష్టించి వ్యాప్తిచేసే సోషల్ మీడియాపై నిఘా ఉంచారు. ఇష్టానుసారంగా పోస్టులు పెడుతూ శాంతియుత వాతావరణానికి భంగం కలిగించే వారిపై నిఘా పెట్టారు. ఇప్పటికే ఎన్నికల సంఘం సాంకేతికతను వినియోగించుకుంటోంది. అభ్యర్థులు ఎవరైన నియమావళి ఉల్లంఘిస్తే ఎవరైనా ఫొటోలు, వీడియోలు తీసి సంబంధిత అధికారికి ఫిర్యాదు చేయవచ్చు.

శెభాష్ 'డ్రైవర్'

- బస్సులో అస్వస్థతకు గురైన మహిళ
- నేరుగా ఆస్పత్రికి తరలింపు


చికిత్స పొందుతున్న షహదా బేగం

నర్సాపూర్(జి): ఆర్టీసీ బస్సులో మహిళ ప్రయాణికురాలు అస్వస్థతకు గురైంది. అప్రమత్తమైన డ్రైవర్ నేరుగా బస్సును ఆస్పత్రికి తరలించి ఆమె ప్రాణాలు కాపాడి శెభాష్ అనిపించుకున్నాడు. భైంసా డిపోకు చెందిన ఆర్టీసీ బస్ నిర్మల్–భైంసా వెళ్తుండగా సోమవారం నర్సాపూర్(జి) వద్ద నిలిపింది. నిర్మల్‌లోని రాంనగర్ కాలనీకి చెందిన షహదా బేగం బస్సు ఎక్కి అస్వస్థతకు గురైంది. అప్రమత్తమైన డ్రైవర్ డ్రైవర్ లింగన్న, కండక్టర్ చొప్పదండి భోజన్న బస్సును నేరుగా నర్సాపూర్(జి) ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుడు సాయికృష్ణ, హెడ్‌నర్స్ లలిత, నర్స్ సునీత ఆమెను పరీక్షించి సెలైన్ ఎక్కించారు. ఈ విషయమై వైద్యుడిని 'సాక్షి'సంప్రదించగా సదరు మహిళ ఏమి తినకుండా ఖాళీ కడుపుతో ప్రయాణించడం వల్ల బీపీ, షుగర్ లెవల్స్ తగ్గాయన్నారు. మహిళా కోలుకున్న అనంతరం ఇంటికి పంపించేశారు. చాకచక్యంగా వ్యవహరించిన బస్ డ్రైవర్‌ను పలువురు అభినందించారు.


నిందితులను కఠినంగా శిక్షించాలి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని దొంగచింత పంచాయతీ పరిధి భీంజీగూడకు చెందిన ఆదివాసీ బాలిక హత్య కేసు నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాబాయి డిమాండ్ చేశారు. సోమవారం బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించారు. బాలిక హత్యకు గురైన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అంతకు ముందు ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌ను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ యువతులు, మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను పట్టుకుని వారిని శిక్షపడేలా చూస్తామని డీఎస్పీ తమతో పేర్కొనట్లు వారు తెలిపారు.

నాటుసారా విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అడ్డగుట్టలో నాటుసారా విక్రయిస్తున్న ముగ్గురిపై సోమవారం కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. పక్కా సమాచారంతోనే గ్రామంలో దాడి చేశామన్నారు. మడావి జంగు, మడావి సుపారీ, టేకం రాములు ఒక్కొక్కరి వద్ద నుంచి 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

ఓట్.. నాట్ ఫర్ సేల్



నర్సాపూర్(జి): అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున మండల కేంద్రానికి చెందిన యువకుడు ఎండీ జాబీర్ ఓ సందేశాన్ని తమ ఇంటి గోడపై రాయించాడు. 'ఈ ఇంటి ఓట్లు అమ్మబడవు 'ఓటు ఆయుధం దానిని మతం కోసమో! కులం కోసమో! డబ్బు కోసమే! వృథా చేయకండి..అని రాయించి ఓటర్లను ఆలోచించేలా చిన్న ప్రయత్నం చేశాడు.

ఉట్నూర్‌లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్


ఫ్లాగ్‌మార్చ్‌లో పోలీసులు, ప్రత్యేక బలగాలు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో పోలీసులు ప్రత్యేక బలగాలతో సోమవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. పాత బస్టాండ్ నుంచి ప్రారంభమైన ఫ్లాగ్‌మార్చ్ అంగడిబజార్, ఐబీ చౌరస్తా, ఎన్టీఆర్ చౌక్, ఐటీడీఏ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం నుంచి పోలీసుస్టేషన్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. బీఎస్ఎఫ్ బలగాలు, జిల్లా సాయుధ పోలీసులు, పోలీసులు సుమారు 150 మంది పాల్గొన్నారు. బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సంజయ్‌కుమార్, ఉట్నూర్, నార్నూర్ సీఐలు రామకృష్ణ, ప్రేంకుమార్, ఉట్నూర్ ఎస్సై మనోహర్ ఉన్నారు.

భార్యపై డీజిల్ పోసి హత్యాయత్నం

ఆదిలాబాద్‌రూరల్: భార్యపై డీజిల్ పోసి హత్యాయత్నానికి పాల్పడిన భర్తపై కేసు నమోదు కేసినట్లు ఎస్సై రహిమతుల్లా తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మావల పోలీస్‌స్టేషన్ పరిధిలో రాంనగర్‌కు చెందిన అడేల్లు ఆయన భార్య లక్ష్మితో గత 20 ఏళ్ల నుంచి గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం భార్యపై డీజిల్ పోసి నిప్పంటించాడు. నిద్రలో లేచిన కుమారుడు గణేశ్ మంటలార్పారు. లక్ష్మి కుడి భుజానికి గాయమైంది. కుమారుడు ఫిర్యాదుతో అడేల్లుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- తమ్ముడు, చెల్లెకు తీవ్రగాయాలు

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44పై డోంగర్‌గావ్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కుటుంబానికి చెందిన సోదరుడి మృతిచెందాడు. ఈ ఘటనలో తమ్ముడు, చెల్లెకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ ఘనీ (17) వారసంతల్లో ఉల్లి, వెల్లుల్లి వ్యాపారం చేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాడు. కాగా, ఆదిలాబాద్‌లోని వారి బంధువుల శుభకార్యానికి తమ్ముడు రహీం, చెల్లి ఉజ్మాను తీసుకుని పల్సర్ బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో వేగంగా వస్తున్న వీరి బైక్ ఎదురుగా వెళ్తున్న ట్రాలీ ఆటోను ఢీకొంది. ఆటో సైతం బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఘనీ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలైన రహీం, ఉజ్మాను అంబులెన్సులో రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

గుండెపోటుతో కుంటాల జలపాతం గైడ్ మృతి

నేరడిగొండ: మండలంలోని కుంటల జలపాతం వద్ద గైడ్‌గా విధులు నిర్వహిస్తున్న పోశెట్టి (65) సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. ఇంటి వద్ద గుండెపోటుకు గురికాగా, కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వారు వచ్చి చూసేసరికి మృతిచెందారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

ట్రాక్టర్ అపహరించిన నిందితుడి రిమాండ్

భైంసాటౌన్: షోరూం నుంచి రోటావేటర్‌తో సహా ట్రాక్టర్ అపహరించిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ ఎల్.శ్రీను తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని స్వరాజ్ ట్రాక్టర్ షోరూం నుంచి ఈనెల 14న శనివారం దుకాణం మూసి వెళ్లగా, 16న సోమవారం తెరిచి చూడగా ట్రాక్టర్ చోరీకి గురైనట్లు గుర్తించారు. మేనేజర్ ఎల్లన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా, షోరూంలో మెకానిక్ పనిచేసే షారుక్‌ఖాన్ దొంగిలించినట్లు తేలిందన్నారు. ఈ మేరకు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఎస్సైలు శ్రీకాంత్, పూర్ణేశ్వర్, సందీప్ ఉన్నారు.

ఇసుక లారీ సీజ్

బోథ్: మండల కేంద్రంలో అధిక లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీని మైనింగ్ అధికారులు సోమవారం సీజ్ చేశారు. పక్కా సమాచారం మేరకు స్థానికులు లారీని ఆపి స్థానిక పోలీస్ స్టేషన్‌తోపాటు మైనింగ్ అధికారులకు సమాచారం అందించారు. మైనింగ్ జిల్లా టెక్నికల్ అధికారి రమేశ్ వేబిల్‌ను పరిశీలించగా 45 మెట్రిక్ టన్నుల ఇసుకకు అనుమతి ఉందన్నారు. మోతాదుకు మించి 60మెట్రిక్ టన్నుల లోడ్‌తో ఉన్నట్లు గుర్తించి రూ.30 వేల జరిమానా విధించామన్నారు.

బతుకమ్మ సంబురం


జనసంద్రంగా మారిన తాంసి వాగు

తలమడుగు/తాంసి/ఆదిలాబాద్: పదిహేను రోజులుగా ఉత్సాహంగా సాగిన బతుకమ్మ వేడుకలు సోమవారంతో ముగిశాయి. తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల్లో మహిళలు, యువతులు, చిన్నారులు రంగురంగు పూలతో బతుకమ్మలను పేర్చి ప్రధాన కూడళ్ల వద్ద ఉంచారు. సంప్రదాయ నృత్యాలు, కోలాటాలు, డీజే సౌండ్, డప్పుచప్పుళ్ల మధ్య ఆడిపాడారు. పల్లెల్లో బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాల్లో అంటూ పాటలు హోరెత్తించాయి. అనంతరం ఊరేగింపుగా వెళ్లి వాగుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. వెళ్లిరా అంటూ వీడ్కోలు పలికారు. జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలోని హనుమాన్ ఆలయం వద్ద మహిళలు, యువతులు బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.


తలమడుగులో..


తాంసిలో..


బతుకమ్మలను నిమజ్జనం చేస్తూ..



సబలెంకా శుభారంభం


మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో గత ఏడాది రన్నరప్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్) శుభారంభం చేసింది. మెక్సికోలో జరుగుతున్న ఈ టోర్నీలో తొలి లీగ్ మ్యాచ్‌లో సబలెంకా 6–0, 6–1తో మరియా సాకరి (గ్రీస్)పై గెలిచింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా ఆరు ఏస్‌లు సంధించి, తన ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. మరో లీగ్ మ్యాచ్‌లో జెస్సికా పెగూలా (అమెరికా) 7–5, 6–2తో రిబాకినా (కజకిస్తాన్)పై విజయం సాధించింది.

అర్జున్‌కు మూడో గెలుపు

గ్రాండ్ స్విస్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మూడో విజయం నమోదు చేశాడు. యూకేలోని ఐల్ ఆఫ్ మ్యాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ఐదో రౌండ్ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన అర్జున్ 68 ఎత్తుల్లో రినాత్ జుమాబయేవ్ (కజకిస్తాన్)పై గెలుపొందాడు. ఐదో రౌండ్ తర్వాత అర్జున్ నాలుగు పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి ఉమ్మడిగా టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు.



అఫ్గాన్ తీన్‌మార్...



ఫారూఖీ

- శ్రీలంకపై ఏడు వికెట్లతో సంచలన విజయం
- ఒకే టోర్నీలో మూడు ప్రపంచ చాంపియన్ జట్లను ఓడించిన హష్మతుల్లా బృందం
- బంతితో మెరిసిన ఫారూఖీ
- రహ్మత్ షా, హష్మతుల్లా, అజ్మతుల్లా అర్ధ సెంచరీలు

ఇకపై తమ జట్టును కూనగా పరిగణించాల్సిన అవసరం లేదని అఫ్గానిస్తాన్ చాటి చెప్పింది. మేటి జట్లపై తాము సాధిస్తున్న విజయాలు గాలివాటమేమీ కాదని తమ నిలకడైన ప్రదర్శనతో నిరూపించింది. మూడోసారి వన్డే ప్రపంచకప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఈసారి తమకంటే అన్ని విభాగాల్లో ఎంతో మెరుగైన జట్లను బోల్తా కొట్టిస్తూ ఔరా అనిపించింది. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను కంగుతినిపించిన ఉత్సాహంతో 1992 విశ్వవిజేత పాకిస్తాన్ జట్టును కూడా మట్టికరిపించిన అఫ్గానిస్తాన్ జట్టు తాజాగా 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంకను ఓడించి అందర్నీ ఆశ్చర్యపరిచింది.

పుణే: ప్రత్యర్థి జట్టు గత రికార్డు ఎలా ఉంటేనేమి తమదైన రోజున సమష్టిగా గర్జిస్తే అద్భుత ఫలితం సాధించవచ్చని వన్డే ప్రపంచకప్ టోర్నీలో అఫ్గానిస్తాన్ జట్టు మూడోసారి నిరూపించింది. భారీ అంచనాలు పెట్టుకోకుండా ఈ మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్ మూడో సంచలన విజయంతో అలరించింది. 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంక జట్టుతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో హష్మతుల్లా షాహిది నాయకత్వంలోని అఫ్గానిస్తాన్ జట్టు ఏడు వికెట్ల తేడాతో గెలిచి అబ్బురపరిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. నిసాంక (60 బంతుల్లో 49; 5 ఫోర్లు), కెప్టెన్ కుశాల్ మెండిస్ (50 బంతుల్లో 39; 3 ఫోర్లు), సమరవిక్రమ (40 బంతుల్లో 36; 3 ఫోర్లు), తీక్షణ (31 బంతుల్లో 29; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫజల్‌హక్ ఫారూఖీ (4/34) శ్రీలంక జట్టును దెబ్బ తీశాడు. ఒకదశలో 134/2తో పటిష్టస్థితిలో కనిపించిన శ్రీలంక నిసాంక అవుటయ్యాక తడబడింది. 107 పరుగుల తేడాలో ఏడు వికెట్లు కోల్పోయింది. కెరీర్‌లో 100వ వన్డే ఆడిన రషీద్ ఖాన్ ఒక వికెట్ తీయగా, మరో స్పిన్నర్ ముజీబ్‌కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం 242 పరుగుల విజయ లక్ష్యాన్ని అఫ్గానిస్తాన్ 45.2 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ గుర్బాజ్ (0) డకౌట్‌కాగా... రహ్మత్ షా (74 బంతుల్లో 62; 7 ఫోర్లు), హష్మతుల్లా షాహిది (74 బంతుల్లో 58 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (63 బంతుల్లో 73 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో అఫ్గానిస్తాన్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. హష్మతుల్లా, అజ్మతుల్లా నాలుగో వికెట్‌కు అజేయంగా 111 పరుగులు జోడించడం విశేషం.

ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓడిపోయిన అఫ్గానిస్తాన్... రెండో మ్యాచ్‌లో 69 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను ఓడించి బోణీ కొట్టింది. మూడో మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో 149 పరుగుల తేడాతో ఓడిపోయి... నాలుగో మ్యాచ్‌లో విజృంభించి 1992 విశ్వవిజేత పాకిస్తాన్‌పై ఏకంగా 8 వికెట్ల తేడాతో గెలిచింది. అనంతరం అదే ఉత్సాహంతో శ్రీలంకను కూడా మట్టికరిపించి అఫ్గానిస్తాన్ పాయింట్ల పట్టికలో ఐదో స్థానానికి ఎగబాకింది. మూడోసారి వన్డే వరల్డ్‌కప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఒకే ప్రపంచకప్‌లో మూడు విజయాలు సాధించడం ఇదే ప్రథమం. 2015 ప్రపంచకప్‌లో ఒక మ్యాచ్‌లో నెగ్గిన అఫ్గానిస్తాన్... 2019 ప్రపంచకప్‌లో ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయింది. ఈ ప్రపంచకప్‌లో మాత్రం అఫ్గానిస్తాన్ తమ కంటే మెరుగైన జట్లకు చెమటలు పట్టిస్తోంది. ఈ టోర్నీలో అఫ్గానిస్తాన్ మిగిలిన మూడు మ్యాచ్‌లను నెదర్లాండ్స్ (నవంబర్ 3న), ఆస్ట్రేలియా (నవంబర్ 7న), దక్షిణాఫ్రికా (నవంబర్ 10న) జట్లతో ఆడుతుంది.



అజ్మతుల్లా



రహ్మత్ షా



హష్మతుల్లా

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) గుర్బాజ్ (బి) అజ్మతుల్లా 46; దిముత్ కరుణరత్నే (ఎల్బీడబ్ల్యూ) (బి) ఫారూఖీ 15; కుశాల్ మెండిస్ (సి) నజీబుల్లా (సబ్) (బి) ముజీబ్ 39; సమరవిక్రమ (ఎల్బీడబ్ల్యూ) (బి) ముజీబ్ 36; అసలంక (సి) రషీద్ ఖాన్ (బి) ఫారూఖీ 22; ధనంజయ డిసిల్వా (బి) రషీద్ ఖాన్ 14; ఏంజెలో మాథ్యూస్ (సి) నబీ (బి) ఫారూఖీ 23; చమీర (రనౌట్) 1; తీక్షణ (బి) ఫారూఖీ 29; కసున్ రజిత (రనౌట్) 5; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 241. వికెట్ల పతనం: 1–22, 2–84, 3–134, 4–139, 5–167, 6–180, 7–185, 8–230, 9–239, 10–241. బౌలింగ్: ముజీబ్ ఉర్ రెహ్మాన్ 10–0–38–2, ఫజల్హక్ ఫారూఖీ 10–1–34–4, నవీన్ ఉల్ హక్ 6.3–0–47–0, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 7–0–37–1, రషీద్ ఖాన్ 10–0–50–1, నబీ 6–0–33–0.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: రహ్మనుల్లా గుర్బాజ్ (బి) మదుషంక 0; ఇబ్రహీమ్ జద్రాన్ (సి) కరుణరత్నే (బి) మదుషంక 39; రహ్మత్ షా (సి) కరుణరత్నే (బి) రజిత 62; హష్మతుల్లా షాహిది (నాటౌట్) 58; అజ్మతుల్లా (నాటౌట్) 73; ఎక్స్‌ట్రాలు 10; మొత్తం (45.2 ఓవర్లలో మూడు వికెట్లకు) 242. వికెట్ల పతనం: 1–0, 2–73, 3–131. బౌలింగ్: మదుషంక 9–0–48–2, రజిత 10–0–48–1, మాథ్యూస్ 3–0–18–0, చమీర 9.2–0–51–0, తీక్షణ 10–0–55–0, ధనంజయ డిసిల్వా 4–0–21–0.

ప్రపంచకప్‌లో నేడు

పాకిస్తాన్ × బంగ్లాదేశ్

వేదిక: కోల్‌కతా

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	6	6	0	12	1.405
దక్షిణాఫ్రికా	6	5	1	10	2.032
న్యూజిలాండ్	6	4	2	8	1.232
ఆస్ట్రేలియా	6	4	2	8	0.970
అఫ్గానిస్తాన్	6	3	3	6	-0.718
శ్రీలంక	6	2	4	4	-0.275
పాకిస్తాన్	6	2	4	4	-0.387
నెదర్లాండ్స్	6	2	4	4	-1.277
బంగ్లాదేశ్	6	1	5	2	-1.338
ఇంగ్లండ్	6	1	5	2	-1.652

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, నె.ర.రే–నెట్ రన్‌రేట్

అనీశ్ డబుల్ ధమాకా

కాంస్య పతకంతోపాటు పారిస్ ఒలింపిక్ బెర్త్ సొంతం



చాంగ్వాన్ (దక్షిణ కొరియా): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల పతకాల వేట కొనసాగుతోంది. సోమవారం జరిగిన పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత యువ షూటర్ అనీశ్ భన్వాలా కాంస్య పతకం సాధించాడు. ఆరుగురి మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో 21 ఏళ్ల అనీశ్ 28 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంతో ముగించాడు. ఈ ప్రదర్శనతో అనీశ్ వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను కూడా ఖరారు చేసుకున్నాడు. ఇప్పటి వరకు షూటింగ్‌లో భారత్‌కు 12 ఒలింపిక్ బెర్త్‌లు లభించాయి. మరోవైపు పురుషుల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో హైదరాబాద్ షూటర్ కైనన్ షెనాయ్, జొరావర్ సింగ్ సంధూ, పృథ్వీరాజ్ తొండైమన్‌లతో కూడిన భారత జట్టుకు రజత పతకం దక్కింది. కైనన్, జొరావర్, పృథ్వీరాజ్ బృందం 341 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచింది. ఇప్పటి వరకు ఈ టోర్నీలో భారత్ 30 పతకాలు సాధించింది.

వెర్‌స్టాపెన్ రికార్డు

ఈ సీజన్‌లో 16వ విజయం



మెక్సికో సిటీ: ఇప్పటికే ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకున్నప్పటికీ... రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ మాత్రం ఫార్ములావన్–2023 సీజన్‌లో ఎదురులేకుండా దూసుకుపోతున్నాడు. మెక్సికో గ్రాండ్‌ప్రి రేసులో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును మూడో స్థానం నుంచి ప్రారంభించిన వెర్‌స్టాపెన్ తొలి మలుపు వద్ద ప్రత్యర్థి డ్రైవర్లను ఓవర్‌టేక్ చేసి ఆధిక్యంలోకి వచ్చాడు. ఆ తర్వాత రేసు చివరిదాకా ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. వెర్‌స్టాపెన్ 71 ల్యాప్‌లను అందరికంటే వేగంగా 2 గంటల 2 నిమిషాల 30.814 సెకన్లలో పూర్తి చేసి విజేతగా నిలిచాడు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్‌కిది 16వ గెలుపు కావడం విశేషం. తద్వారా ఒకే ఏడాది అత్యధిక ఎఫ్1 రేసుల్లో గెలిచిన డ్రైవర్‌గా తన పేరిటే ఉన్న రికార్డును వెర్‌స్టాపెన్ బద్దలు కొట్టాడు. గత ఏడాది వెర్‌స్టాపెన్ 15 రేసుల్లో గెలుపొందాడు. ఓవరాల్‌గా వెర్‌స్టాపెన్ కెరీర్‌లో ఇది 51వ విజయం. ఈ క్రమంలో కెరీర్‌లో అత్యధిక ఎఫ్1 విజయాలు సాధించిన డ్రైవర్ల జాబితాలో నాలుగో స్థానంలో ఉన్న అలైన్ ప్రాస్ట్ (ఫ్రాన్స్) సరసన నిలిచాడు.

లెక్క సరిచేసిన భారత్



రాంచీ: ఆసియా మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు వరుసగా మూడో విజయంతో 'హ్యాట్రిక్' సాధించింది. చైనా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 2–1 గోల్స్ తేడాతో నెగ్గింది. భారత్ తరఫున దీపిక (15వ ని.లో), సలీమా టెటె (26వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. చైనా జట్టుకు జాంగ్ జియాకి (41వ ని.లో) ఒక గోల్ అందించింది. ఈ గెలుపుతో ఇటీవల హాంగ్జౌ ఆసియా క్రీడల్లో చైనా జట్టు చేతిలో సెమీఫైనల్లో ఎదురైన ఓటమికి భారత్ బదులు తీర్చుకుంది.

జ్యోతి యర్రాజీకి స్వర్ణం



పనాజీ: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు మూడో స్వర్ణ పతకం లభించింది. సోమవారం జరిగిన అథ్లెటిక్స్ ఈవెంట్‌లో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి యర్రాజీ చాంపియన్‌గా అవతరించింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన జ్యోతి 13.22 సెకన్లలో అందరికంటే వేగంగా ఫైనల్ రేసును ముగించి అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు తెలంగాణ ఖాతాలో 11వ పతకం చేరింది. మహిళల స్విమ్మింగ్ 800 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో వ్రితి అగర్వాల్ రజత పతకం సాధించింది.

సినిమా

అమ్మాడీ...



● మృణాల్ ఠాకూర్, నాని

మాట రూపంలో కాకుండా ఇంకాస్త ఎక్కువగా ప్రేమను వ్యక్తపరచాలనుకున్నప్పుడు హీరో హీరోయిన్ పాట పాడుకోవడం చూస్తుంటాం. మృణాల్ ఠాకూర్‌పై నాని అలాంటి ప్రేమనే వ్యక్తపరిచారు. ప్రేమను వ్యక్తపరుస్తూ 'అమ్మాడీ...' అంటూ ఆమెను ఉద్దేశించి పాడారు నాని. 'హాయ్ నాన్న' చిత్రంలోని ఈ పాటను నవంబర్ 4న రిలీజ్ చేయనున్నారు. నాని, మృణాల్ ఠాకూర్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'హాయ్ నాన్న'. నాని కుమార్తెగా బేబీ కియారా ఖన్నా నటించింది. ఈ చిత్రం కోసం హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరచిన పాటల్లో తొలి పాట 'సమయమా..', రెండో పాట 'గాజు బొమ్మ..'ను ఇప్పటికే రిలీజ్ చేశారు. 'అమ్మాడీ...' మూడో పాట. నాని, మృణాల్ మధ్య సాగే రొమాంటిక్ సాంగ్ ఇది అని యూనిట్ పేర్కొంది. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డా. విజయేందర్ రెడ్డి తీగల ఈ చిత్రాన్ని నిర్మించారు. డిసెంబర్ 7న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్ ఐఎస్‌సీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సతీష్ ఈవీవీ.

కౌంట్ డౌన్ స్టార్ట్



● వెంకటేశ్

వెంకటేశ్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'. నవాజుద్దీన్ సిద్దిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా, బేబీ సారా, జయప్రకాశ్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న 'సైంధవ్' జనవరి 13న సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. కాగా ఇది వెంకటేశ్ కెరీర్‌లో 75వ చిత్రం కావడం విశేషం. తాజాగా 'సైంధవ్' విడుదలకు కౌంట్ డౌన్ స్టార్ట్ చేస్తూ మేకర్స్ ఓ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. ''పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న చిత్రం 'సైంధవ్'. సినిమా విడుదలకు ఇంకా 75 రోజులు ఉంది. సంతోష్ నారాయణన్ ఈ చిత్రం కోసం అద్భుతమైన ఆల్బమ్ సిద్ధం చేశారు. త్వరలో మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ చేయబోతున్నాం'' అని మేకర్స్ అన్నారు. ఈ చిత్రానికి సహనిర్మాత: కిశోర్ తాళ్లూరు, కెమెరా: యస్. మణికందన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం (వెంకట్).

ప్రేక్షకులకు పది రెట్ల థ్రిల్ గ్యారంటీ - అనిల్ విశ్వనాథ్



''మా ఊరి పొలిమేర' తొలి భాగం ఓటీటీలో రిలీజ్ కావడంతో ప్రేక్షకుల స్పందన పెద్దగా తెలియలేదు. సినిమా చూసి, చాలామంది బాగుందని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. శుభలేఖ సుధాకర్‌గారు ఫోన్ చేసి, 'దర్శకుడిగా నీకు మంచి భవిష్యత్ ఉంటుంది' అని చెప్పడంతో నాపై నాకు మరింత నమ్మకం పెరిగింది'' అని డైరెక్టర్ డా. అనిల్ విశ్వనాథ్ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల, బాలాదిత్య, రాకేందు మౌళి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర–2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 3న రిలీజవుతోంది. ఈ సందర్భంగా అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ– ''మా ఊరి పొలిమేర' ఎక్కడ ముగిసిందో అక్కడి నుంచే రెండో భాగం మొదలవుతుంది. తొలి భాగం హిట్టవ్వడంతో సీక్వెల్‌పై అంచనాలు పెరిగాయి. అందుకే పార్ట్ 2 స్క్రీన్‌ప్లేను మరింత బలంగా తయారు చేశాను. తొలి భాగంతో పోల్చితే ప్రేక్షకులు దాదాపు పది రెట్ల థ్రిల్ ఫీలవుతారు. వంశీ నందిపాటిగారి సహకారంతో మా చిత్రాన్ని ఘనంగా రిలీజ్ చేస్తున్నాం. 'బన్నీ' వాసుగారికి నచ్చడంతో మా సినిమా పెద్ద రేంజ్‌కు వెళ్లింది. 'మా ఊరి పొలిమేర 3' కూడా ఉంటుంది. అంతకన్నా ముందు వేరే జానర్‌లో ఓ సినిమా చేస్తా'' అన్నారు.

ప్రేమకథ షురూ



● నాగచైతన్య, అలేఖ్య హారిక, సంతోష్ శోభన్

సంతోష్ శోభన్, అలేఖ్య హారిక జంటగా కొత్త సినిమా షురూ అయింది. సుమన్ పాతూరి దర్శకత్వంలో అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్‌పై ఎస్‌కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్న ఈ సినిమా సోమవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి డైరెక్టర్ చందూ మొండేటి కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో నాగచైతన్య క్లాప్ కొట్టగా, డైరెక్టర్ వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహించారు. డైరెక్టర్ హరీష్ శంకర్, నిర్మాత రవిశంకర్ యూనిట్‌కి స్క్రిప్ట్ అందించగా, హీరో సుశాంత్, దర్శకులు హను రాఘవపూడి, రాహుల్ సంకృత్యాన్ యూనిట్‌కి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో మంచి ప్రేమకథ ఉంటుంది'' అన్నారు. ''నా మనసుకు దగ్గరైన కథ ఇది. నేను, ఎస్‌కేఎన్, సందీప్ రాజ్, అలేఖ్య.. మేమంతా ఫ్రెండ్స్. ఈ సినిమా వారితో కలిసి చేస్తుండటంతో మరింత బాధ్యతగా భావిస్తున్నా'' అన్నారు సాయి రాజేశ్. ''ఈ సినిమాకు దర్శకత్వం వహించే చాన్స్ ఇచ్చిన నా ఫ్రెండ్ సాయి రాజేశ్‌కు థ్యాంక్స్'' అన్నారు సుమన్ పాతూరి. ''హీరోయిన్‌గా చేయాలనే నా కల ఈ చిత్రంతో నెరవేరుతోంది'' అన్నారు అలేఖ్య హారిక. ''తెలుగు అమ్మాయిలను ప్రోత్సహించాలనే నా సినిమాల్లో తెలుగు అమ్మాయిలనే హీరోయిన్‌గా తీసుకుంటున్నాను'' అన్నారు ఎస్‌కేఎన్. ఈ చిత్రానికి కెమెరా: అస్కర్, సంగీతం: విజయ్ బుల్గానిన్, సహనిర్మాతలు: ధీరజ్ మొగిలినేని, రమేశ్ పెద్దింటి.

ఒకేసారి ఐదు సినిమాలు ఒక సంచలనం - బ్రహ్మానందం



● అచ్యుతరావు, బ్రహ్మానందం, ఉపేంద్ర

''ఒక సినిమా తీయడానికే ఇబ్బంది పడుతున్న ఈ రోజుల్లో ఒకేసారి ఐదు సినిమాలు తీస్తుండటం ఓ సంచలనం. తన కుమారుడు ఉపేంద్రని హీరోగా పరిచయం చేయడంతో పాటు ఒకేసారి అతనితో ఐదు సినిమాలు తీస్తున్న అచ్యుతరావుకి అభినందనలు. దీనివల్ల పరిశ్రమను నమ్ముకున్నవారికి అవకాశాలు ఇచ్చి, భోజనం పెట్టినట్లవుతుంది. 'ఉపేంద్రగాడి అడ్డా' మంచి హిట్టవ్వాలి'' అని సీనియర్ నటుడు బ్రహ్మానందం అన్నారు. కంచర్ల ఉపేంద్ర, సావిత్రీ కృష్ణ జంటగా ఆర్యన్ సుభాన్ ఎస్‌కే దర్శకత్వం వహించిన చిత్రం 'ఉపేంద్రగాడి అడ్డా'. ఎస్ ఎస్‌ఎల్‌ఎస్ క్రియేషన్స్‌పై కంచర్ల అచ్యుతరావు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరై, 'ఉపేంద్రగాడి అడ్డా' ట్రైలర్‌ను, '1920 భీమునిపట్నం' పోస్టర్‌ను విడుదల చేశారు. అలాగే ఉపేంద్ర హీరోగా ఇదే బ్యానర్‌లో తీస్తున్న ఐదు సినిమాల టీజర్లను విడుదల చేశారు. కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ– ''మా బ్యానర్‌లో నవంబర్ నుంచి ప్రతీ నెల ఒక సినిమాను విడుదల చేయబోతున్నాం'' అన్నారు. ''నా పుట్టిన రోజుకి ఇది వెలకట్టలేని పెద్ద బహుమతి'' అన్నారు కంచర్ల ఉపేంద్ర. ''సోషల్ మీడియా నేటి సమాజాన్ని ఎంతగా ప్రభావితం చేస్తోందో మా చిత్రం ద్వారా చూపిస్తున్నాం'' అన్నారు ఆర్యన్ సుభాన్ ఎస్‌కే. హీరోయిన్ సావిత్రీ కృష్ణ, సహనిర్మాతలు కంచర్ల సుబ్బలక్ష్మి, కంచర్ల సునీత పాల్గొన్నారు.

మమ్మల్ని సినిమా కలిపింది - విజయ్ దేవరకొండ



● బ్రహ్మానందం, విజయ్ దేవరకొండ, తరుణ్ భాస్కర్, సాయికృష్ణ

''నేను, దర్శకులు నాగ్ అశ్విన్, తరుణ్ భాస్కర్, సందీప్ రెడ్డి వంగా వేర్వేరు చోట్ల పెరిగాం. మా నేపథ్యాలు వేరు.. మమ్మల్ని సినిమా కలిపింది. 'పెళ్ళి చూపులు'తో నన్ను హీరోగా పరిచయం చేశాడు తరుణ్ భాస్కర్. ఆ తర్వాత 'ఈ నగరానికి ఏమైంది'తో కొందరు కొత్తవాళ్లకు కెరీర్ ఇచ్చాడు. ఇప్పుడు 'కీడా కోలా'లోనూ ప్రతిభ ఉన్న కొత్త వాళ్లు కనిపిస్తున్నారు. తరుణ్‌కి తనపై, తన కథలపై చాలా నమ్మకం. ఈ విషయంలో అతన్ని గౌరవిస్తాను. ఇండస్ట్రీకి దొరికిన అదృష్టం తను'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కీడా కోలా'. రానా సమర్పణలో కె. వివేక్ సుధాంషు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద్ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 3న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన విజయ్ దేవరకొండ మాట్లాడుతూ–''తరుణ్ భాస్కర్‌పై ఉన్న నమ్మకంతో చెబుతున్నా.. 'కీడా కోలా' మజా ఇస్తుంది. తర్వలో మా ఇద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుంది'' అన్నారు. సీనియర్ నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ–''డైరెక్టర్ జంధ్యాలగారి సినిమాలు చేస్తున్నప్పుడు వినోదం ఎంత హాయిగా పండిందో మళ్లీ 'కీడా కోలా'కి అలాంటి అనుభూతి కలిగింది'' అన్నారు. ''నా 'పెళ్ళి చూపులు, ఈ నగరానికి ఏమైంది' చిత్రాల విడుదలప్పుడు చిన్న భయం ఉండేది. ప్రేక్షకుల స్పందన తెలుసుకునేందుకు థియేటర్ బయటే తిరిగేవాడిని. 'కీడా కోలా' విషయంలో ఆ భయం లేదు'' అన్నారు తరుణ్ భాస్కర్. ''రెండు గంటల పాటు ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు'' అన్నారు నిర్మాతలు సాయికృష్ణ గద్వాల్, శ్రీపాద్.

కథని నమ్మి చేశాం - శ్రీరామ్



● అవసరాల, ఖుషీ, శ్రీరామ్, సాయికిరణ్, కోన వెంకట్

''పిండం అనేది జననానికి, మరణానికి సంబంధించినది. ఈ 'పిండం' సాయి కిరణ్ లాంటి ప్రతిభగల దర్శకుడి పుట్టుకకు (ఇండస్ట్రీలో) కారణం కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు రచయిత, నిర్మాత కోన వెంకట్. సాయికిరణ్ దైదా దర్శకత్వంలో శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' ఉపశీర్షిక. కళాహి మీడియాపై యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్నారు కోన వెంకట్. మరో అతిథి బీవీఎస్ రవి (రచయిత, దర్శకుడు) మాట్లాడుతూ– ''ఈ సినిమా టీజర్, నిర్మాణ విలువలు బాగున్నాయి. తప్పకుండా విజయం సాధిస్తుంది'' అన్నారు. శ్రీరామ్ మాట్లాడుతూ– ''కథని నమ్ముకొని చేసిన చిత్రం 'పిండం'. ఈ సినిమాలో భాగం కావడం సంతోషంగా ఉంది. ఈ చిత్రంలో నటించిన ఇద్దరు పిల్లల నటన చూసి నేనే ఆశ్చర్యపోయాను. ఇలాంటి మంచి సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు. ''కళాహి మీడియా బ్యానర్‌పై 'పిండం'లాంటి మంచి సినిమాలు మరిన్ని చేస్తాం'' అన్నారు యశ్వంత్ దగ్గుమాటి. ''ఇదొక ఇంటెన్స్ హారర్ ఫిల్మ్'' అన్నారు సాయి కిరణ్ దైదా. సంగీత దర్శకుడు కృష్ణ సౌరభ్ సూరంపల్లి, కెమెరామేన్ సతీష్ మనోహర్ తదితరులు మాట్లాడారు.

అంబాజీపేట సంతృప్తి ఇచ్చింది - సుహాస్



● సుహాస్, శివానీ నాగరం

''అంబాజీపేట మ్యారేజి బ్యాండు' ఫ్రెష్ సబ్జెక్ట్. సినిమా కొత్తగా ఉంటుంది. నటుడిగా నాకు సంతృప్తినిచ్చింది. ఒక మంచి సినిమా చూశామనే అనుభూతితో ప్రేక్షకులు థియేటర్స్ నుంచి బయటకు వస్తారు'' అని సుహాస్ అన్నారు. దుశ్యంత్ కటికినేని దర్శకత్వంలో సుహాస్, శివానీ నాగరం జంటగా నటించిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. జీఏ2 పిక్చర్స్, మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ నిర్మించాయి. ఈ చిత్ర సంగీతదర్శకుడు శేఖర్ చంద్ర స్వరపరచిన 'గుమ్మా....' అంటూ సాగే తొలి పాటను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దుశ్యంత్ కటికినేని మాట్లాడుతూ– ''ఈ పాటకి రెహ్మాన్ మంచి లిరిక్స్ ఇచ్చారు. ఈ సినిమాలోని పాటలన్నీ బాగుంటాయి'' అన్నారు. ''జనవరి నెలాఖరులో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు ధీరజ్ మొగిలినేని. ''మంచి సినిమాలు ఎప్పుడొచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తారు. 'అంబాజీపేట..' హిట్ కావాలి'' అన్నారు నిర్మాత ఎస్‌కేఎన్. నటులు జగదీష్, నితిన్, డ్యాన్స్ మాస్టర్ మోయిన్ తదితరులు మాట్లాడారు.